7

# చార్లీ చాప్లిన్

విషాదం బొమ్మయితే వినోదం బొరుసు.

నవ్వును తిరగేస్తే ఏడుపవుతుంది.

అందుకనే కొన్ని సందర్భాలలో ఏడ్వలేక నవ్వుతుంటాం.

ఈ అద్వైతాన్ని అద్భుతంగా చూపించిన మహా కళాకారుడు చార్లీ చాప్లిన్.

ప్రతి మనిషిలోనూ దాగిన భయానికి, బెరుకుకు, అపజయానికి, న్యూనతా భావానికి ప్రతీక అనదగిన ఒక బడుగువాని పాత్రను సృష్టించి, ఆ పాత్రను విశ్వజనీనం చేసిన స్రష్ట చాప్లిన్. అతడు ఏడిస్తే మనకు నవ్వొచ్చేది. అతడు నవ్వుతుంటే మనకు కడుపులో దేవినట్లయ్యేది.

చాప్లిన్ నిర్మించిన సుమారు ఎనభై చిత్రాలలో చాల మూకీ చిత్రాలు వున్నాయి. 'గోల్డ్‌రష్', 'లైమ్‌లైట్', 'మస్యూర్ వెర్డో', 'గ్రేట్ డిక్టేటర్, దికిడ్' వంటివి కలకాలము మానవాళిని కదిలించగల కళాఖండాలు.

''చలి, ఆకలి, దారిద్ర్యం తెచ్చిపెట్టే అవమానాలు-ఇవి ఒక వ్యక్తి ఆలోచనలను, మనస్సును తీర్చిదిద్దుతాయని నా నమ్మకం. అంతేగాని అన్నిటికన్నా సెక్స్ ప్రభావం ఎక్కువ అన్న ఫ్రాయడ్‌తో నేను ఏకీభ

వించను" అన్నాడు చాప్లిన్. అందుకనే ఆ బాధలే అతడి ఇతివృత్తాలయ్యాయి.

తన చిత్రాలలోని హాస్యం గురించి విశ్లేషిస్తూ చాప్లిన్ "జీవితమంతా బాధతో, సంఘర్షణతో నిండి వుంటుంది. ఈ బరువులను మనం మోసే శక్తిని హాస్యం ఇస్తుంది. హాస్య రసపు సులోచనాలతో చూచినప్పుడు-అతి ముఖ్యమయిన దాని మధ్య-అముఖ్యమయినది కన్పిస్తుంది; సమంజసంలో అసమంజస మెయినది కానవస్తుంది. ఈ మాత్రం రిలీఫ్ లేకపోతే మనమంతా మతులు కోల్పోయేవాళ్ళం" అంటాడు.

1918 లో అమెరికా ప్రభుత్వం తాను జారీచేసిన యుద్ధకాలపు బాండ్‌లను అమ్మిపెట్టమని అప్పటికే సుప్రసిద్ధుడైన చాప్లిన్‌ను కోరింది. అతడు మరొక సుప్రసిద్ధ నటుడు డగ్లస్ ఫెయిర్‌బాండ్స్, నటి మేరీపిక్‌ఫోర్డుతో కలిసి అనేక రాష్ట్రాలు తిరిగి కొన్ని లక్షల డాలర్ల బాండ్‌లను అమ్మాడు. ఆ పనిమీద తిరుగుతుండగా ఒక వూళ్ళో చాప్లిన్ గౌరవార్థం ఒక పార్టీ యిచ్చారు. అక్కడ మిలిటరీ జనరల్స్ కూడా వున్నారు. వారిలో జనరల్ స్కాట్ అన్నాయన మొదటినుండీ ధుమధుమలాడుతున్నాడు. అతడికి ఆ పార్టీ నిచ్చిన గృహస్థు అంటే సరిపడట్లు లేదు. పార్టీ వాతావరణం కులాసాగా లేకుండా కొంచెం బిగుసుకున్నట్లుగా వుంది. అప్పుడు జనరల్ స్కాట్ ఆ గృహస్థును చూపిస్తూ --"ఈయనకూ, అరటిపండుకూ తేడా ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు చాప్లిన్ — "అరటిపండు కయితే తొక్క ఒలిచేయవచ్చు" అన్నాడు.

ఆ తర్వాత పార్టీ హాయిగా సాగిందని వేరే చెప్పాలా?

నటన గురించి చాప్లిన్ ఇలా అంటాడు.

''నటుడికి అంతరాంతరాల్లో ఒక నెమ్మదితనం, నిగ్రహం వుండాలి. నటించబోయే దృశ్యం ఎంత బీభత్సకరమయినా అతడు ప్రశాంతంగావుండి తన భావాలను మార్చుకుంటూ, తీర్చిదిద్దుకుంటూ నటించాలి... ఆ వ్యక్తిలో బీజప్రాయంగా నయినా ఆ నటనా శక్తి లేకపోతే నటించడం అన్నది నేర్పడం అన్నది సాధ్యంకాదు. మనిషి నిండా బుద్ధి, హేతువు వుండి భావోద్విగ్నత, ఆర్ద్రత లేకపోతే అతడు కసాయివాడు కావచ్చు, హంతకుడు కావచ్చు; తద్భిన్నంగా మనిషంతా ఆర్ద్రతే అయితే వెర్రివాడవుతాడు. ఆలోచన, భావమూ సమ తూకంలో కలవాడు నటశ్రేష్ఠుడు అవుతాడు.... నే నెప్పుడూ నటనను అభ్యసించలేదు. గొప్ప నటుల సాన్నిహిత్యంలో ఓనమాలు దిద్దుకున్నాను. స్వతహాగా నటించే శక్తి కలవాడినయినా నేను వారి రిహార్సల్స్‌నుండి 'టెక్నిక్' నేర్చుకున్నాను. ఎంతటి నటనాశక్తి కలవాడయినా టెక్నిక్‌ద్వారా మెరుగులు దిద్దుకోక తప్పదు."

—"ది ఐడిల్ క్లాస్" అన్న సినిమా షూటింగ్ సమయంలో ఒక పెద్ద కాగడావుండే దృశ్యం వుంది. చాప్లిన్, నిప్పు తగిలితే కాలని రాతిమీద (ఆస్‌బెస్టాస్) డ్రస్ వేసుకున్నాడు. అయినా ఒకసారి ఆ కాగడా వేడి అతడి శరీరానికి బాగా తగిలింది. వెంటనే ఇంకొక పొర రాతి నారను ఆ పంట్లా నికి అతికించారు... కాని ఆ ప్రొడ్యూసర్ వెంటనే మంచి పబ్లిసిటీ వస్తుంది కదా అని ఈవార్తను కొంత అతిశయోక్తితో పత్రికలవారి కిచ్చాడు. "ఆ సాయంకాలం పత్రికలలో నా శరీరం, మొహం, చేతులు- అన్నీ కాలి పోయాయి'' అని వచ్చిన వార్త చూచి నిర్ఘాంతపోయాను. నాకు అంత ఘోర ప్రమాదం ఏదీ జరగలేదని, ఉన్న పరిస్థితిని తెల్పుతూ నేను పత్రికలకు వెంటనే తెలిపాను. అయితే నేను తెలిపినదానిని కొన్ని పత్రికలే ప్రచురిం చాయి" అని రాశాడు చాప్లిన్. ఔను మరి, ఏదివార్తయో, ఏది అవార్తయో పత్రికలవాళ్ళకు తెలుస్తుంది కాని చాప్లిన్‌కు తెలియదు కదా...

ఒకసారి మాంటెకార్లోలో ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది దానిని గురించి ఆర్తర్ కోస్లర్ తన **Act of creation** అన్న పుస్తకంలో పేర్కొన్నాడు.

మాంటెకార్లోలో ఒక పెద్ద పార్టీ జరిగింది. అందులో ఒక పోటీ ఏర్పాటు చేశారు. చార్లీ చాప్లిన్‌లా ఎవరు నటిస్తారో వారికి బహుమతులు ఇస్తామని ప్రకటించారు. పది పన్నెండుమందిదాక అతిథులు, చాప్లిన్ వేషాన్ని అభినయాన్ని అనుకరించే ఆపోటీలో పాల్గొన్నారు. ఆరోజు ఆ పార్టీలో చార్లీ చాప్లిన్ కూడా వున్నాడు. ఆయన కూడా ఆ పోటీలో పాల్గొన్నాడు. ఆయనకు మూడవ బహుమతి వచ్చింది!

ఈ వింతను విశ్లేషిస్తూ కోస్లర్ ఇలా అంటాడు:

"ఒక కొత్తదారిని, ఒకకొత్త టెక్నిక్‌ను మొదటిసారిగా కనుగొని, వాడడమే ఉపజ్ఞ కల మేథావి — లేదా 'జీనియస్' యొక్క లక్షణం; ఆ దారిని ఆ తర్వాత ఎందరో వస్తారు. ఆ టెక్నిక్‌ను ఆ తర్వాత ఎందరో వాడుకుంటారు. వారిలో కొంచరు దానిని కనిపెట్టిన ఆదిపురుషుడికన్న ఎత్తులను అధిరోహించడం జరగవచ్చు. కనుక జీనియస్ లక్షణం ఉపజ్ఞ (originality)యే కాని పరిపూర్ణత కాదు" అంచేతనే చిత్ర రచనలో కొత్త బాణీలకు ఆద్యుడు పాబ్లోపికాసో అయినా అతడి చిత్రాలకు నూటికి నూరుపాళ్ళు అనుకరణలయిన చిత్రాలను కొందరువేస్తే, ఏది పికాసోదో, యేది కాదో తెలుసుకోవడం చిత్రకళానిష్ణాతులకు సైతం చేతనయ్యేది కాదు'' అంటూ కోస్లర్ ఒక సంఘటనను వర్ణిస్తాడు.

'నాకు తెలిసినావిడ ఒకతెకు ఎవరో పికాసో చిత్రాన్ని బహూకరించగా ఆమె దానిని అసలు **original** పికాసో కాదని తెలిసి, మెట్లదగ్గర వేలాడదీసింది. ఆ తర్వాత ఆమె ఇంటికొచ్చిన నిపుణుడొకాయన జాగ్రత్తగా

భూతద్దంలో పరిశీలించి ఆ చిత్రం పికాసోకు నకలు కాదని, అసలుదేనని తేల్చాడు అప్పుడామె దానిని డ్రాయింగు రూములో వేలాడదీసింది. ఇది గమనించిన నేను ఎందుకలా చేశారని అడిగితే "చిత్రం మారలేదు నిజమే కాని అది అసలు పికాసోది అనే సరికి నా దృష్టి మారింది" అన్నదిట. కనుక ఆమె ఆ చిత్రంలోని వస్తువు, రేఖలు, రంగులు, వాటిమధ్య ఒద్దిక, మొత్తం రచన వంటి విషయాలను బట్టి గాక కేవలం చిత్రకారుడి పేరుని బట్టి దాని విలువను స్థానాన్ని నిర్ణయించిందన్న మాట. ఇదొక రకమయిన బడాయి. Snobbery అంటాడు కోస్లర్. ఈ బడాయి అలవాటయినవారు ఒక కళాసృష్టిలోని అంతర్గతమైన విలువలను బట్టిగాక, బాహ్యవిలువలను బట్టి దాన్ని పూజిస్తారంటారాయన.

ఒక పుస్తకములోని రచనయొక్క మంచిచెడ్డలనుబట్టిగాక, అది రాసినవారెవరో, దాని అట్టపేరు ఎంత బాగుందో, దానికి పీఠిక ఎవరు రాశారో, దానిలో అచ్చుపనితనం ఎంత బాగుందో వగయిరాలననుసరించి ఆ పుస్తకాన్ని బేరీజు వేయడం— ఇలాటిదేనన్నమాట!

అందుకనే "ఒక పుస్తకాన్ని సమీక్షించే ముందుగా దాన్ని చదివితే పక్షపాత వైఖరి ఏర్పడుతుందని నేను చదవను" అన్నాడొక పాశ్చాత్య మేధావి. ఇటువంటి కొలతలూ, సమీక్షలూ మన సినీ, సాహిత్యాది రంగాలలో మనకు పరిచితాలే కదా!

★